www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 23 మే 2024

5

పశ్చిమ గోదావరి

పిహెచ్‌డి కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

తాడేపల్లిగూడెం: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్(ఏపి నిట్)లో 2024-25 జూన్ సెషన్‌కు సంబంధించిన పిహెచ్‌డి(ఫుల్ టైమ్, పార్ట్ టైమ్), ఇంటర్ డిసిప్లినరీ కోర్సులకు (రెండు విభాగాలను అనుసంధానిస్తూ) అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫుల్‌టైమ్ అభ్యర్థులు మాస్టర్ డిగ్రీతో పాటు గేట్‌లో తప్పనిసరిగా అర్హత సాధించాలన్నారు. పార్ట్ టైమ్ అభ్యర్థులు మాస్టర్ డిగ్రీతోపాటు ఏదైనా అకడమిక్ ఇనిస్టిట్యూట్‌లో గాని, పరిశ్రమలో గాని రెండేళ్ళు పనిచేసిన అనుభవం ఉండాలని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులను రాత పరీక్ష, ముఖాముఖి ద్వారా ఎంపికచేస్తామని, ఇతర వివరాలకు ఏపి నిట్ వెబ్‌సైట్(www.nitandhra.ac.in)ను సంప్రదించాలని నిట్ అడ్మిషన్ల అధికారి డాక్టర్ తపన్ తెలిపారు.

ఆరోగ్యశ్రీకి సుస్తీ..!

పేదవాడి ఆరోగ్యంతో ప్రభుత్వం ఆడుకుంటోంది. ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో ప్రయివేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు బుధవారం నుంచి నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజానీకం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రెండు జిల్లాల్లోని ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల్లో ప్రతిరోజూ 60కుపైగా సర్జరీలు జరుగుతుంటాయి. ఒక్కసారిగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో రోగులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. కొన్ని ఆసుపత్రుల్లో కొనసాగుతున్నట్లు చెబుతున్న మాటలు బూటకంగా మారాయి. ఏలూరు జిల్లాలో అతిపెద్ద మెడికల్ ఆసుపత్రి 'ఆశ్రం'లో ఆరోగ్యశ్రీ సేవలు ఆగిపోవడంతో రోగులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించి ఆరోగ్యశ్రీ ఆగకుండా చూడాలని జనం కోరుతున్నారు.

- ఆసుపత్రులకు బకాయిలు విడుదలగాక సేవలు నిలిపివేత
- రెండు జిల్లాల్లో 60 ప్రయివేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు
- ప్రతిరోజూ 60కిపైగా ఆరోగ్యశ్రీలో వివిధ సర్జరీలు
- 'ఆశ్రం'లో సేవలు నిలిపివేతతో తీవ్ర ప్రభావం
- గగ్గోలుపెడుతున్న రోగులు..
- దాదాపు రూ.70 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాన్యుడికి అందనంత ఎత్తుకు వైద్యం, విద్య ఖర్చులు పెరిగిపోయాయి. ఆరోగ్యశ్రీ లేకపోతే సామాన్యులు వైద్యం చేయించుకోలేని పరిస్థితి నెలకొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేకుండా పిల్లలను చదివించుకోలేని పరిస్థితి ఏర్పడింది. నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాల్సిన ప్రభుత్వాలు ఏమాత్రమూ పట్టించుకోని పరిస్థితి నెలకొంది. వైద్యం విషయంలో సామాన్యులకు ఎంతో కొంత ఆసరాగా ఆరోగ్యశ్రీ సేవలు నిలుస్తున్నాయి. గుండె ఆపరేషన్లు, కిడ్నీలకు డయాలసిస్, ఎముకలు సర్జీలు, కేన్సర్ రోగులకు కీమోథెరఫీ వంటి సేవలు ఆరోగ్యశ్రీలో కీలకంగా ఉన్నాయి. ఆరోగ్యశ్రీ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ప్రయివేటు ఆసుపత్రులు సేవలు నిలిపివేసిన పరిస్థితి నెలకొంది. పేదల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై జనాల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అతిపెద్ద ఆసుపత్రి, మెడికల్ కాలేజీ 'ఆశ్రం'లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసినట్లు యాజమాన్యం తెలిపింది. దీంతో సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందుల్లో పడే పరిస్థితి నెలకొంది.

ఏలూరు జిల్లాలో 31, పశ్చిమలో 29 మొత్తం 60 ప్రయివేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నాయి. ప్రతిరోజూ తక్కువగా లెక్కించిన రెండు జిల్లాలో 60కుపైగా ముఖ్యమైన సర్జీలు జరుగుతున్నట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి. డయాలసిస్, గుండె ఆపరేషన్లు, రోడ్డు ప్రమాద కేసుల్లో ఎముకల సర్జీలు, కేన్సర్ రోగులకు సంబంధించి కీమోథెరఫీ వంటి అనేకం జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేటు ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.1500 కోట్లు ఉన్నట్లు చెబుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి రెండు జిల్లాల్లోనూ రూ.70 కోట్లకుపైగా ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్క ఆశ్రం ఆసుపత్రికే రూ.15 కోట్ల వరకూ ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్నట్లు సమాచారం. ప్రతి ఆసుపత్రికీ తక్కువగా లెక్కించినా రూ. 50 లక్షలకుపైగానే ఆరోగ్యశ్రీ సొమ్ములు చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. దీంతో ప్రయివేటు ఆసుపత్రుల్లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేసిన పరిస్థితి నెలకొంది. అధికారులు ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో మాట్లాడినట్లు కొన్ని ఆసుపత్రులు ముందుకు సాగించేందుకు ఒప్పుకున్నట్లు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి వేరుగా ఉందని తెలుస్తోంది. దీంతో అత్యవసర కేసులకు సంబంధించి రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రూ.వేలు, లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకోలేక ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగుతున్నప్పటికీ ప్రధాన సర్జీలకు సంబంధించిన సేవలు అక్కడ లేకుండా పోయాయి. దీంతో ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఉంది. కాంట్రాక్టర్లకు, ఆస్మదీయులకు రూ.వేల కోట్లు కట్టబెడుతున్న పాలకులు పేదల కోసం ఖర్చుచేసే ఆరోగ్యశ్రీ బకాయిలు మాత్రం చెల్లింకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇదే పరిస్థితి కొనసాగితే పేదల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే పరిస్థితి రానుంది. ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

డాలర్ల పంటకు.. డీజిల్ దెబ్బ..!

పెట్రోల్ బంకుల్లో లూజ్ డీజిల్ అమ్మకాలు నిలిపివేత

ఆందోళనలో ఆక్వా రైతులు

డీజిల్ అమ్మకాలు చేపట్టాలని విన్నపం

చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆంక్షల నేపథ్యంలో పెట్రోల్ బంకుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాలు, టిన్నుల్లో పెట్రోల్, డీజిల్ పోయరాదని పోలీసు శాఖ ఆదేశించింది. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల యాజమాన్యాలకు, పోలీసులు ఇప్పటికే నోటీసులు అందజేశారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. దీంతో అప్రమత్తమైన ఎన్నికల కమిషన్ ఎలక్షన్ కోడ్ పూర్తయ్యే వరకూ కొన్ని రోజులు పెట్రోల్ బంకులకు వచ్చే వాహనాలకు మాత్రమే పెట్రోల్ కొట్టాలని, విడిగా ఎవరైనా వచ్చి పెట్రోల్, డీజిల్ అడిగితే వారి వివరాలు పోలీస్‌స్టేషన్‌కు ఇవ్వాలని పోలీసు శాఖ కోరింది. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల కమిషన్ సైతం ఆదేశించింది.



పోలీసులు పెట్టిన బ్యానర్

వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఓ వైపు ఎండ, ఓ వైపు వర్షం, మరో వైపు మబ్బులుగా ఉంటోంది. ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గులుగా ఉండడంతో ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ స్థాయి పడిపోయి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి.

ఎన్నికల వేడి నేపథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, దాడులను నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్ పెట్రోల్ బంకుల్లో లూజుగా పెట్రోల్, డీజిల్ విక్రయాలను నిలిపివేస్తూ అన్ని బంకులకు ఇచ్చిన ఆదేశాలు ఆక్వా రైతుల పాలిటశాపంగా మారింది. జిల్లాలో గొడవలు జరగకపోయినా ఇసి ఆదేశాలను ఉన్నతాధికారులు, పోలీసులు కఠినంగా అమలు చేయడంతో అన్ని బంకుల్లో లూజు విక్రయాలను నిలిపివేశారు. వాహనాల్లో మినహా టిన్నుల్లో, డబ్బాల్లో పెట్రోల్, డీజిల్ వేయడం ఆపేశారు. చేపల చెరువుల్లో చేపలు, రొయ్యలకు ఆక్సిజన్ అందించేందుకు ఏరియేటర్లను ఏర్పాటు చేస్తారు. జిల్లాలో సుమారు 150 పైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. భీమవరం, ఉండి, ఆకివీడు, కాళ్ల, గణపవరం, మొగల్తూరు, నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి తదితర ప్రాంతంల్లో ఎక్కువగా ఆక్వా సాగవుతోంది. జిల్లాలో సుమారు 49,040 ఎకరాల్లో రైతులు రొయ్యల సాగు చేపట్టారు. సుమారు లక్ష ఎకరాలకుపైగా రొయ్యలు, చేపల సాగు చేపట్టారు. ఏటా జిల్లా నుంచి 15 లక్షల మెట్రిక్ టన్నుల ఆక్వా ఎగుమతులు జరుగుతున్నాయి. ఏడాదికి 14 వేల కోట్లకుపైగా ఆదాయం తెచ్చి పెడుతోంది. చెరువుల్లో కరెంటు మోటార్ల ద్వారా ఏరియేటర్లు నడపగా మరికొన్ని చెరువుల వద్ద ఆటో ఇంజిన్లతో నడుపుతున్నారు. ఆటో ఇంజిన్లు డీజిల్‌తో తిరుగుతాయి. కరెంటు మోటార్లు ఉన్నచోట కరెంట్ పోయినప్పుడు జనరేటర్ల సాయంతో మోటార్లను తిప్పుతారు. దీంతో ఆక్వా రైతులకు డీజిల్ వాడకం ఎక్కువగా ఉంటుంది. సగటున ఎకరం చెరువు ఉన్న రైతు 20 లీటర్ల డీజిల్ వాడుతుంటాడు. ఈ డీజిల్‌ను టిన్నుల్లో నింపుకొని చెరువుల వద్దకు తీసుకెళ్తారు. తాజాగా ఇసి ఇచ్చిన ఆదేశాలతో బంకుల్లో లూజుగా డీజిల్ ఇవ్వకపోవడంతో ఆక్వా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డీజిల్ ఇవ్వకుంటే ఏరియేటర్లు తిరగక ఆక్సిజన్ అందక తమ పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో చేపలు, రొయ్యలకు ప్రతి నిమిషమూ ఆక్సిజన్ అందించడం తప్పనిసరి అని, ఏరియేటర్లు ఆగిపోతే వెంటనే చేపలు, రొయ్యలు మృత్యువాత పడతాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎన్నికల గొడవలు లేని ఈ ప్రాంతంలో ఉన్నతాధికారులు డీజిల్ వరకైనా మినహాయింపు ఇవ్వాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. చాలా గ్రామాలు, పట్టణాల్లో కిరాణా దుకాణాలు, కూల్ డ్రింక్ షాప్‌ల వద్ద నిత్యం పెట్రోల్, డీజిల్ అమ్ముతారు. అనుకోకుండా చాలా మంది ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ అయిపోవడంతో షాపుల వద్ద కొనుగోలు వాడతారు. ప్రస్తుతం దుకాణాల వద్ద పెట్రోల్ లేకపోవడంతో కిరణాషాపుల వద్ద రేట్లు సైతం పెంచేశారు. పెట్రోల్ అయిపోయిన వాహనదారులు బంకు వరకూ వాహనం నడిపించుకుంటూ వెళ్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టామని చివరి దశలో ఏరియటర్లు తిరగక ఆక్సిజన్ అందకపోతే రొయ్యలు తేలిపోతాయని, దీంతో తీవ్రంగా నష్టపోతామని ఆక్వా రైతులు ఆవేదన చెందుతున్నారు. నిత్యం డీజిల్ కొనే రైతులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వివరాలు తెలిపితే విచారించి, వారికి డీజిల్ కొట్టేలా చర్యలు చేడతామని పోలీస్ సిబ్బంది తెలుతున్నారు. నిత్యం కొనే ఆక్వా రైతులకు డీజిల్ కొట్టేలా చర్యలు చేపట్టాలని ఆక్వారైతులు కోరుతున్నారు. కొన్నిచోట్ల తక్కువ మొత్తంలో డీజిల్ కొడుతున్నట్లు సమాచారం.

నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు పూర్తిచేయాలి

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పోస్టల్ బ్యాలెట్, ఇటిపిబిఎస్ ఓట్ల లెక్కింపు నిబంధనలకు అనుగుణంగా సజావుగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్ వద్ద పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓటర్ల ఇటిపిబిఎస్ (ఎలక్ట్రానికల్ ట్రాన్స్మిటెడ్ పోస్టల్ బ్యాలెట్) ఓట్ల లెక్కింపుపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత నియోజకవర్గాల ఆర్ఒలకు, ఎఆర్ఒలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. తొలుత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా లెక్కింపు ప్రక్రియను క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఎంతో ముఖ్యమైందన్నారు. పొరపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలన్నారు. ఏడు నియోజకవర్గాలకు సంబంధించి 51 మంది ఎఆర్ఒలను ఓట్ల లెక్కింపు విధులకు కేటాయించామని, తొమ్మిది మంది ఎఆర్ఒలు పార్లమెంట్ నియోజకవర్గానికి, 42 మంది ఎఆర్ఒలు ఏడు అసెంబ్లీ నియోజవర్గాల విధుల్లో పాల్గొంటారని తెలిపారు. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఇవిఎంలలో ఓట్ల లెక్కింపు కంటే ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి టేబుల్‌కూ నలుగురు సిబ్బందిని నియమించడం జరుగుతుందని, వారిలో ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. మూడు దఫాలుగా రాండమైజేషన్ ప్రక్రియ చేసిన అనంతరం కేబుల్ వారీగా సిబ్బంది కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. డిక్లరేషన్ వ్యాలీడ్ కాకపోతే పోస్టల్ బ్యాలెట్ ఇన్ వ్యాలీడ్ అవుతుందన్నారు. అలాగే ఓటర్ సిగ్నేచర్, గెజిటెడ్ అధికారి సంతకం, లేకపోవడం, తదితర నిబంధనలను పాటించని సందర్భంలో కూడా ఓటు చెల్లనిదిగా పరిగణించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, జిల్లా, గ్రామ సచివాలయాల అధికారి, జిల్లా ఎన్నికల శిక్షణ అధికారి కెసిహెచ్.అప్పారావు, ఎపి టూరిజం జెడి ఆచంట నియోజకవర్గం ఆర్ఒ వి.స్వామినాయుడు, నరసాపురం ఆర్‌డిఒ, ఆర్ఒ ఎం.అచ్యుత్ అంబరీష్, భీమవరం ఆర్‌డిఒ, ఆర్ఒ కె.శ్రీనివాసులు రాజు తదితర నియోజకవర్గాలకు చెందిన ఆర్ఒలు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కొనసాగిన 3ఎఫ్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఫుడ్ ఫ్యాట్స్ యాజమాన్యం మొండివైఖరి విడనాడి వెంటనే కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయాలని కోరుతూ 3ఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజు కొనసాగాయి. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిఐటియు ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు హాజరై మాట్లాడారు. 3ఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్లకు వెంటనే వేతన ఒప్పందం చేయాలని వారు డిమాండ్ చేశారు. 2023 మార్చితో గత వేతన ఒప్పందం పూర్తయినప్పటికీ 3ఎఫ్ యాజమాన్యం నూతన వేతన ఒప్పందం అమలు చేయకుండా కాలయాపన చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. గత వేతన ఒప్పందం 29.5 శాతం అయ్యిందని, ఇప్పుడు గతం కంటే ఎక్కువ వేతన ఒప్పందం చేయాలని, వేతన ఒప్పందం ప్రతి రెండు సంవత్సరాలకోసారి అమలు జరపాలని వారు 3ఎఫ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. 3ఎఫ్ యాజమాన్యం మొండివైఖరిపై లేబర్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. 3ఎఫ్ యాజమాన్యం మొండివైఖరి విడనాడకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన, నిరసన, సమ్మె కార్యక్రమాలు నిర్వహించి యాజమాన్యానికి తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ దీక్షలకు పట్టణంలోని రైల్వే గూడ్స్ షెడ్, ఉల్లిపాయలు, అపరాలు, పండ్లు, కూరగాయలు, చింతపండు, మార్కెట్ యార్డు, ఎరువులు, ట్రాన్స్‌పోర్టు జట్టు వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, 3ఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ పెనుమాక శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దీక్షల వద్ద మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు

పర్సా జీవితం కార్మిక వర్గానికి అంకితం

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కార్మికులకు సంఘం అవసరాన్ని గుర్తించి, ఏర్పాటు చేసి, పోరాటాలు నిర్వహించి, వేతనాలతో పాటు హక్కులు, చట్టాల కోసం కడవరకూ కార్మికవర్గానికి అంకితమై పనిచేసిన పర్సా సత్యనారాయణ మహోన్నత వ్యక్తి అని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలం అన్నారు. పర్సా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా భీమవరంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పర్సా చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎం.ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో పుట్టి, పెరిగి సింగరేణి బొగ్గు గని కార్మికులను ఐక్యం చేసి పోరాటాల ద్వారా హక్కులు, చట్టాలు సాధించారన్నారు. నాడు జరిగిన విశాఖ ఉక్కు ఉద్యమంలో తన ఎంఎల్ఎ పదవికి కూడా రాజీనామా చేసి, ఉద్యమానికి బాసటగా నిలిచారని తెలిపారు. ఏళ్ల తరబడి జైలు జీవితం అనుభవించి, కార్మిక వర్గానికి అంకితమై పని చేశారని అన్నారు. ఆయన జీవితం, ఆయన చెప్పిన పాఠాలు రాష్ట్రంలో ఎంతోమంది కార్మిక నాయకత్వానికి స్ఫూర్తినిచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వైకుంఠరావు, వెంకటేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : నివాళులర్పిస్తున్న నాయకులు

నరసాపురం: రాష్ట్ర ఉద్యమ నిర్మాత, ఉమ్మడి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, తెలంగాణ పోరాట యోధులు కామ్రేడ్ పర్సా సత్యనారాయణ వర్ధంతి సభను స్థానిక మీరా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. పర్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఆయన జీవిత కాలాన్ని పీడిత ప్రజల కోసం, కార్మికవర్గ హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, నాయకులు పొగాకు నారాయణరావు, మహిళా నాయకులు కె.వెంకటలక్ష్మి, ఝాన్సీ రాణి, శ్రీదేవి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: నివాళులర్పిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం: సింగరేణి కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన వ్యక్తి పర్సా సత్యనారాయణ అని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. కార్మిక నేత, మార్క్సిస్టు యోధుడు కామ్రేడ్ పర్సా సత్యనారాయణ 9వ వర్ధంతి సభ తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. ముందుగా పర్సా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ వర్ధంతి సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండ రామిరెడ్డి, కరక వెంకటరావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మేట్రేడ్డి రమణ, గొర్రెల సతీష్ కుమార్, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకట దుర్గారావు హాజరయ్యారు.

తణుకు: కార్మిక నేత, యోధుడు, ఆంధ్ర కార్మికోద్యమ నిర్మాతల్లో ప్రముఖుడైన పర్సా సత్యనారాయణ 9వ వర్ధంతి స్థానిక అమరవీరుల భవనంలో సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్యదర్శి గుబ్బల గోపి అధ్యక్షతన జరిగింది. తొలుత పర్సా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.దక్షిణామూర్తి మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ కార్మికుల జీవితాలలో వెలుగు నింపడానికి ఉద్యమాలను ఆయుధంగా చేసుకున్నారన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయకుమారి, కామన మునిస్వామి, సీనియర్ నాయకులు గార రంగారావు, పలు సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకులో..

మూఢ నమ్మకాలను పాలద్రోలేందుకు జెవివి కృషి

జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ

ప్రజాశక్తి - పాలకొల్లు

జన విజ్ఞాన వేదిక మూఢనమ్మకాలను పారద్రోలడంలో ప్రధాన భూమిక పోషిస్తుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి, జనవిజ్ఞాన వేదిక సంయుక్త నిర్వహణలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంను వైష్ణవి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు జంక్ ఫుడ్స్ మానివేయాలని, కూల్ డ్రింక్స్ తాగవద్దని, సమతుల ఆహారం తీసుకోవాలని తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. అలాగే తెలుగు భాషను పరిరక్షించడంలో సమితి చేస్తున్న కృషిని కొనియాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రామలక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 22న అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. 80 శాతం మానవ ఆహారం మొక్కల నుండే లభిస్తుందని, 80 శాతం గ్రామీణులకు మొక్కల ఆధారిత మందుల ద్వారా ప్రాథమిక ఆరోగ్యం అందుతుందని, ఒక మిలియన్ జంతు, వృక్ష జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని తెలిపారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.దేవేంద్ర చేసిన సైన్స్ మ్యాజిక్ ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జీవవైవిధ్య దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.మల్లికార్జున శర్మ, సిహెచ్.రంగారావు, రంజిత్, పిజికె.గోఖలె, వై.అజయ్ కుమార్, ఎమ్‌డీ.గణేష్, జెఆర్‌వి.నాగేశ్వరరావు, పీర్ సాహెబ్ పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని రైతాంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆకుల హరే రామ్ డిమాండ్ చేశారు. బుధవారం ఉండి మెయిన్ సెంటర్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో మండల ఉపాధ్యక్షులు వంజరపు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆకుల హరేరామ్ పాల్గొని మాట్లాడుతూ ధాన్యాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అమ్మి నెల రోజులు కావస్తున్నా రైతుల ఖాతాల్లో డబ్బులు పడకపోవటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బయట నుంచి తెచ్చిన సొమ్ములకు అధిక వడ్డీలు చెల్లించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రకటించినట్లుగా క్వింటా ధాన్యానికి కనీసం రూ.500 ధర బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆక్వా, చిన్న, సన్నకారు రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50 పైసలకు ఇవ్వాలని, మోటార్లు పంపకాలు సబ్సిడీపై ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇరిగేషన్ సమస్యలపై దృష్టి పెట్టి బ్రిటిష్ కాలం నాటి ఉండి అక్విడెక్ట్ పునర్నిర్మాణం చేయాలని, బొండాడ డ్రెయిన్ ఆధునికీకరణ పనులు వెంటనే చేపట్టి ఖరీఫ్‌లో ముంపుకు గురికాకుండా రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ రబీలో పంట ఆశాజనకంగా ఉండటం కారణంగా కౌలు రైతులు పంటను పండించడంలో పోటీలకు వెళ్లొద్దని, మగతాలు పెంచుకోవద్దని కౌలు రైతులకు హితవు పలికారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కిలారి తవిటి నాయుడు, సహాయ కార్యదర్శి మాదాసు గోపి, వీరవల్లి శ్రీనివాస్, చిట్టి అన్నవరం పాల్గొని మాట్లాడారు.



మాట్లాడుతున్న హరేరామ్

వరి మాసూళ్లలో రైతులు

దంచి కొడుతున్న ఎండ.. ఒబ్బిడైన వరి మాసూళ్లు

ఆనందంలో రైతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

గడచిన వారం రోజులుగా ఎండా, వాన, మబ్బులతో ఇబ్బంది పెట్టిన వాతావరణం బుధవారం ఎండతో బాగా దంచి కొట్టడం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే కోతలు పూర్తయ్యి వ్యవసాయ కల్లాల్లోను, రోడ్ల మార్జిన్లకు చేర్చిన ధాన్యం మాసూళ్లు చేసే పనిలో వారు పాల్గొన్నారు. గత వారంగా వాతావరణం అనుకూలంగా లేకపోవడం వల్ల ఢీలా పడ్డ రైతులు, కౌలు రైతులు ఉత్సాహంగా పనుల్లో పడ్డారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర



గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న గుడిమెట్ల గోపాలరెడ్డి(56) నెగ్గిపూడిలోని ఆయన స్వగృహంలో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన భీమడోలు మండలంలోని పూళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ అసిస్టెంట్‌గా గత కొద్ది సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆకస్మికంగా మృతి చెందిన గోపాలరెడ్డికి స్థానిక యుటిఎఫ్, ఎపిటిఎఫ్, ఎస్‌టియు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కె.కాశీ విశ్వనాథం, పిఎన్‌వి.ప్రసాద్, నీలం రామ్మోహన్, కె.సాయి రెడ్డి, డిఎన్‌వి.సత్యనారాయణ, లక్ష్మణ్ రెడ్డి సంతాపం తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

మొగల్తూరు: ముత్యాలపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఐసెట్టి మల్లిఖార్జునరావు(49) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మొగల్తూరుకు చెందిన మల్లిఖార్జునరావు గత ఏడాది బండి ముత్యాలమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం తన ఇంటిలో ఉండగా ఉదయం 6 గంటల సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అదే నిమిషంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. మల్లిఖార్జునరావు మృతి విషయాన్ని తెలుసుకున్న ఆయన స్నేహితులు ముత్యాలపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, యుటిఎఫ్ మండల ఉపాధ్యాయులు మల్లిఖార్జునరావు భౌతిక ఖాయాన్ని దర్శించి నివాళులర్పించారు.

రైతుల్ని కంగారు పెట్టిన వాన

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో మరోసారి వాన రైతుల్ని కంగారు పెట్టింది. ఎండుతున్న ధాన్యం తడిసే పరిస్థితి ఏర్పడింది. ఆరబెట్టుకున్న ధాన్యం పోగు చేసుకునేందుకు కంగారు పడ్డారు. సోమవారం ఉదయం వరకు కురిసిన వానకు తడిసిన ధాన్యం రైతులు మంగళవారం ఉదయం ఆరబెట్టుకున్నారు. ఉదయాన్నే ఎండ కాయడంతో రైతులు కొద్దిసేపు ఊపిరి పీల్చుకున్నారు. తడి పొడి ధాన్యం ఆరబెట్టుకున్నారు. అయితే ఎండ భారీగా ఉండగానే అకస్మాత్తుగా ఒక్కసారిగా వాన వచ్చి పడింది. మంగళవారం మధ్యాహ్నం 2:30 సమయంలో ఆకస్మికంగా ఈ వాన కురిసింది. దీంతో రైతుల కంగారు కంగారుగా కొంతమేర ధాన్యం పోగు చేసుకోగలిగారు. అయితే ఆరబెట్టుకుందాం అనుకున్న ధాన్యం మరోసారి తడుపుకున్నట్టు అయింది. చిన్నవానే కావడంతో రైతుకు చిన్నవేదన తోటి సరిపోయింది. పోడి ధాన్యం కాస్త తడిగా మారాయి. ఇప్పుడు రైతుకి రెట్టింపు పని పెరిగింది. ఇది ప్రకృతి రైతుతో ఆడుకునే పరిస్థితి.

నేరాలు - ఘోరాలు

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలీని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక జంక్షన్ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జంక్షన్ రైల్వే స్టేషన్ ఎస్ఐ బుధవారం తెలిపారు. సుమారు 50 సంవత్సరాలు గల వ్యక్తి ఒకటో నెంబర్ ప్లాట్ ఫారంలో టాయిలెట్స్ దగ్గర ఉన్న సిమెంట్ బెంచ్‌పై పడుకుని ఉండగా మృతి చెందినట్లు గుర్తించామన్నారు. అతని ఒంటిపై తెలుపు రంగు కట్ బనియన్, ముక్కుపొడి రంగు ఫుల్ డ్రాయర్, నలుపు రంగు రెండు పేటల మొలతాడు ధరించి యున్నాడు. పుట్టుమచ్చలు కుడివైపు తొడ మీద ఒక పుట్టుమచ్చ, ఎడమవైపు తొడ మీద ఒక పుట్టుమచ్చ ఉందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఇతని ఫోటోలు గుర్తించి 7093939777 ఈ నెంబర్లను సంప్రదించాలని భీమవరం జిఆర్‌పి ఎస్ఐ పిటివి.రమణ తెలిపారు.

భట్లమగటూరులో యువకుని అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని భట్లమగటూరు గ్రామంలోని పొలాల్లో ఆ గ్రామానికి చెందిన యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. పెనుమంట్ర పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రవీంద్ర బాబు కథనం మేరకు గ్రామానికి చెందిన పొలమూరి జీవరత్నం కుమారుడు పొలమూరి శివకుమార్(20) ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తుంటాడు. ఈనెల 20వ తేదీ రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చిన కొడుకును తండ్రి మందలించడంతో అతను ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాగా మంగళవారం గ్రామంలో శివకుమార్ విగత జీవిగా కనిపించడంతో తమకు అందిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి వెళ్లా మని ఆయన అన్నారు. బుధవారం ఉదయం తణుకు గవర్నమెంట్ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం జరిపి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెల్లడించారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - మొగల్తూరు

కులం పేరుతో దూషించిన సంఘటనపై బుధవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.వెంకటరమణ తెలిపారు. కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన కమతం రాజేష్‌ను కొత్తట గ్రామానికి చెందిన జక్కుల సత్యనారాయణ గతనెల 28న తాటిచెట్టు నుంచి ముంజి కాయలు కొట్టమని కోరాడు. దీనికి రాజేష్ తన ఆరోగ్యం బాగోలేదని, తాడిచెట్టు ఎక్కలేనని చెప్పడంతో ఆగ్రహించిన సత్యనారాయణ రాజేష్‌ను కులం పేరుతో దూషించి అతనిపై దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు. ఈ కేసుపై డిఎస్‌పి దర్యాప్తు చేస్తారని ఎస్ఐ తెలిపారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కొత్తట గ్రామంలో ఈనెల 13న రహదారి ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు కొప్పడి వెంకట్రావు బుధవారం మృతి చెందారు. దీనికి సంబంధించి మొగల్తూరు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఓటు వేసి ఇంటికి వెళ్తుండగా జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో వెంకట్రావు తలకు గాయమైంది. ఆయనకు చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై గతంలోనే కేసు నమోదు చేశామని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకి అప్పగించామని ఎస్ఐ కె.వెంకటరమణ తెలిపారు. వెంకటరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచి ఘట్టం శ్రీనివాస్, జనసేన నాయకులు ఆకుల గణేష్, పడవల సురేష్ పరామర్శించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

డంపింగ్ యార్డుతో స్థానికుల అవస్థలు

పొగతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
ఏళ్ల తరబడి పట్టిపీడిస్తోన్న డంపింగ్ యార్డ్ సమస్య
ప్రజలకు వసతులు కల్పించడంలో నగర పంచాయతీ విఫలం

ప్రజాశక్తి - ఆకివీడు

పట్టణంలోని డంపింగ్ యార్డుతో అక్కడ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దట్టమైన పొగతో అక్కడ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పట్టపగలు కూడా వాహనాలు అటువైపు వెళ్లలేని పరిస్థితి నెలకొందని వారు ఆందోళన చెందుతున్నారు. ఏళ్ల తరబడి డంపింగ్ యార్డ్ సమస్య పట్టిపీడిస్తోన్నా పట్టించేకునే నాథుడే కరువయ్యాడని వారు వాపోతున్నారు..

దట్టమైన పొగతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

నగర పంచాయతీ స్థాయి రోజురోజుకీ పెరుగుతోంది. ఆమేరకు అవసరాలూ పెరుగుతున్నాయి. అయితే తద్వారా వస్తున్న ఆదాయం నగర పంచాయతీ తీసుకుంటుంది, తప్ప ప్రజలకు వసతులు మాత్రం కల్పించడం లేదన్నది ఇక్కడ సర్వత్రా వస్తున్న విమర్శలు. అందులో భాగంగానే అత్యంత ప్రధానమైన డంపింగ్ యార్డ్ సమస్య ఆకివీడుని ఏళ్ల తరబడి పట్టిపీడిస్తోంది. ఒకటి చెత్త రోడ్డు మీదకి రావడంతో ఆ చెత్త మీద ప్రయాణించే వాహనాలు జారి పడిపోయి దెబ్బలు తగులుతున్నాయి. మరొకటి చెత్త నుంచి వచ్చే దుర్వాసన, అంటించినప్పుడు వచ్చే పొగ వల్ల ప్రయాణికులు ఊపిరిపీల్చుకోలేకపోతున్నారు. ఈ రెండు మరింత దారుణమైన సమస్యలుగా మారాయి. ఆ పరిసరాల్లో నివసించే వాళ్లు ఇళ్లు ఖాళీ చేసే పరిస్థితి ఏర్పడింది. పంచాయతీగా ఉండగానే ఈ సమస్య తలెత్తింది. అయితే అప్పట్లో సర్పంచి గొంట్ల గణపతి, కార్యదర్శి దాగూర్ చాకచక్యంగా వ్యవహరించి పని జరిపించారు. రోడ్డు పక్కగా పొలాల మధ్యలో ఉన్న పంచాయతీ పోరంబోకు స్థలంలోకి చెత్త మళ్లిస్తామని అక్కడ వారిని ఒప్పించారు. ఆమేరకు కొంతమేర లోపలికి మళ్లించారు. అంతలో పంచాయతీ కాస్తా నగర పంచాయతీగా మారింది. లోపల ఆక్రమణదారుల నుంచి భూమిని శోధన చేసుకోలేకపోయారు. నగర పంచాయతీ ఏర్పడిన సుమారు సంవత్సరనరకాలం పైబడి అధికారుల పాలనలోనే కొనసాగింది. అప్పుడు ఎన్నోసార్లు ప్రజలు విజ్ఞాపన సమర్పించారు. అయినా ఫలితం లేదు. ఇటీవల మున్సిపాలిటీ పాలకవర్గ ఏర్పడింది. అనంతరం తరచూ ఈ సమస్యపై ప్రజలు పోరాడుతూనే ఉన్నారు. ఇటీవల ఆ చెత్త రోడ్డు మీదకు రావడంతో ఆ మార్గంగా ప్రయాణించే కొల్లేరు గ్రామాల ప్రజలు కూడా తిరుగుబాటు చేశారు. ప్రధాన రహదారిని స్తంభింపజేశారు.

ఎన్నోసార్లు ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం మాత్రం దక్కలేదు. దుర్వాసన, దారుణమైన పొగ ఈ రెండిటి వల్ల అక్కడ వారికి మొత్తం అనారోగ్యం, తీవ్ర జబ్బులమయంతో అనారోగ్య బారిన పడుతున్నారు. ఆ రహదారి గుండా గ్రామాలకు వెళ్లే సుమారు 10 గ్రామాల ప్రజలకు అక్కడ చెత్త అంటించినప్పుడు వచ్చే పొగతో కళ్లు కనిపించవు. వారికి కూడా అనారోగ్యం పాలవుతున్నారు. ప్రమాదాలకు నెలవుగా ఈ ప్రాంతం మారుతుంది. అధికారులు ఇప్పటికైనా పట్టించుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో మరోసారి తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

గుంటూరు పాస్ట్ పాసింజర్‌ను పునరుద్ధరించాలి

విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్‌కు వినతి

ప్రజాశక్తి - ఉండి

నర్సాపురం - గుంటూరు పాస్ట్ పాసింజర్‌ను వెంటనే పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్‌కు వినతి పత్రం పంపినట్లు రైల్వే ప్రయాణికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మన నాగబాబు, సిహెచ్.బంగారురావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెల్టా ప్రాంత వాసులకు విజయవాడ వెళ్లేందుకు ఉదయం సమయంలో ఉన్న ఏకైక రైలు నర్సాపూర్-గుంటూరు పాస్ట్ పాసింజర్ మాత్రమే అని, దానిని ఈనెల 30 వరకూ రద్దు చేస్తున్నట్లు రైల్వే డివిజన్ అధికారులు ప్రకటించడం పట్ల ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఆకస్మికంగా రైళ్లను రద్దు చేయడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కనీసంగా ఉదయం పూట వెళ్లే మచిలీపట్నం పాసింజర్‌ను విజయవాడ వరకూ పొడిగిస్తే ఈ ప్రాంత వాసులకు ఎంతో అనువుగా ఉంటుందని, అధికారులు ఈమేరకు తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల సంఘం విజ్ఞప్తి చేస్తుంది. ఈ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు కూడా రైల్వే బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లాలని ప్రయాణికుల సంఘం తరఫున నాగబాబు, బంగారురావు కోరుతున్నారు.

గ్రంథాలయాల్లో కొనసాగిన వేసవి శిక్షణా శిబిరాలు

పెనుమంట్ర: విద్యార్థులకు ఆంగ్ల భాషను నేర్పుతున్న ఉపాధ్యాయురాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులు ఇష్టంగా నేర్చుకుంటే ఆంగ్ల భాష చాలా సులభమని విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయిని పడాల సువర్ణ గౌరి అన్నారు. మార్టేరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో ఆమె పాల్గొని ఇంగ్లీష్ భాష పట్ల విద్యార్థుల్లో ఉన్న భయాలను తొలగించే విధంగా ఇంగ్లీష్ మేడ్ ఈజీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిర్ల సూర్యనారాయణ రెడ్డి పిల్లలచే శ్లోక పఠనం చేయించారు. తదుపరి సరదాగా విద్యార్థులు చిత్రలేఖనం చేశారు. చదరంగంలో మెళకువలు చెప్పి, పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత, రోటరీ ప్రతినిధులు, శాఖ గ్రంథాలయం సిబ్బంది, గ్రంథాలయాధికారి పిటి శివకుమార్ పాల్గొన్నారు.

నరసాపురం: ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల సందర్భంగా పిల్లలకు కథలు చెప్పడం, కథల పుస్తకాలు చదివించడం, యోగా మెడిటేషన్ క్లాస్‌లు, డ్రాయింగ్, క్రాఫ్ట్‌లో శిక్షణ ఇవ్వడం జరిగింది. స్కూల్ అసిస్టెంట్ జి.శ్రీనివాస్, హెచ్ఎంకె.వెంకటేశ్వరరావు, సుధీర్ మోహన్, సూర్యంబాబు రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొన్నారు. ఈ తరగతుల్లో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. పిల్లలందరూ ఈ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాల్సిందిగా గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్ కుమారి తెలిపారు.

నరసాపురంలో..

కాళ్ల: జువ్వలపాలెం గ్రామంలో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. మూడో తరగతి నుంచి పదవ తరగతి వరకూ చదువుకున్న విద్యార్థులు సుమారుగా 270 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కంప్యూటర్‌పై ప్రాథమిక అవగాహన కల్పించారు. యోగా, గణితంలో మెలికలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బైర్రాజు ఫౌండేషన్ గ్రామ వికాస సమితి కన్వీనర్ గోకరాజు, వినోద రంగరాజు, బైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్స్ ఎం.రామ కృష్ణంరాజు, పెనుమాకు భానుమూర్తి, నంబూరి శివ వర్మ పాల్గొన్నారు.



కాళ్ల: ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

వృద్ధుడికి పెన్షన్ అందజేయించిన నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మరోసారి మానవత్వంతో స్పందించారు. మే 1న అందాల్సిన పెన్షన్ సొమ్ము 22 రోజులు గడిచినా నేటికీ చేతికి అందలేదని పాలకొల్లు పట్టణ మావుళ్లమ్మ పేటకు చెందిన వృద్ధుడు కోరాడ అప్పారావు ఆయనను కార్యాలయంలో కలిసి ఆవేదన వ్యక్తంచేశారు. బ్యాంకు, సచివాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపాడు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ ఎండ తీవ్రత, వడగాల్పులు ఎక్కువగా ఉండడంతో ఆ వృద్ధున్ని తన కారులో ఎక్కించుకొని పెన్షన్ అందకపోవడానికి గల కారణం తెలుసుకునేందుకు సచివాలయానికి వెళ్లారు. స్థానిక ఐసిఐసిఐ బ్యాంకు ఖాతాలో అతనికి సొమ్ము వేసామని సచివాలయ ఉద్యోగిని చెప్పడంతో అక్కడి నుంచి బ్యాంకుకు వెళ్లి మేనేజర్‌తో మాట్లాడగా వాడకం లేని బ్యాంకు ఖాతాలో వేయడం వల్ల కెవైసి చేయాలని తెలపడంతో ఎంఎల్ఎ అక్కడే దగ్గరుండి వృద్ధునికి కెవైసి జరిగేలా పత్రాలు పూర్తి చేయించారు. 2 రోజుల్లో సొమ్ము చేతికి అందుతుందని బ్యాంక్ అధికారి తెలిపారు. ఆ వృద్ధునికి ఎంఎల్ఎ రామానాయుడు మజా తాగించి, మోటార్ సైకిల్‌పై ఇంటికి పంపించే ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత, గాల్పులను దృష్టిలో ఉంచుకుని ఈనెల 22వ తేదీకి కూడా పెన్షన్ అందని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వమే సొమ్మును డ్రా చేసి సచివాలయ ఉద్యోగులతో ఇంటికి అందజేసే ఏర్పాట్లు చేయాలని ఎంఎల్ఎ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ తప్పిదం వల్లే ఈనెల 22వ తేదీకి కూడా కొందరు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్ సొమ్ము అందలేదని చెప్పారు. వాడుకలో లేని బ్యాంకు ఖాతాల్లో సొమ్ము వేయడం వల్లనే చేతికి అందని పరిస్థితి ఎదురైందన్నారు. సచివాలయ ఉద్యోగులు ద్వారా అందజేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతున్న నిమ్మల

బోర్డులకే పరిమితమైన 'ఉచిత గాలి'

ప్రజాశక్తి - ఆకివీడు

పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్‌తో పాటు వినియోగదారుల సౌకర్యార్థం వారి టైర్లకు అవసరమైన గాలి సౌకర్యం కూడా బంకుల వద్ద కలిగించాలని ప్రభుత్వం ఆదేశాలు ఉన్నాయి. అయితే సుమారు దశాబ్ద కాలం నాడు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు మేరకు దేశమంతటా పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల వాహనాలకు గాలి కొట్టే ఏర్పాట్లు చేశారు. ఈ సౌకర్యం వారికి ఉచితం. అక్కడ ఒక మనిషి కూడా ఉండాలి ఆ మనిషి వచ్చిన వాహనాలు గాలి కొట్టాలి. అది ప్రభుత్వ నిబంధన. ఆ నిబంధన ఇప్పుడు గాలికి వదిలేశారు. గాలికొట్టే ఎయిర్ బాక్సులు బోర్డులకు మాత్రమే పరిమితమయ్యాయి. గాలి కొట్టే యాంత్రీకరణ విధానం గాలికిపోయింది. ఇక అక్కడ మనిషి ఉండే ప్రసక్తే లేకుండా పోయింది. ప్రస్తుతం అక్కడ బోర్డులు, ఖాళీ డబ్బాలు మాత్రమే మిగిలాయి. ఇది ఒకటే కాదు ప్రభుత్వ నిబంధనలు సర్వత్రా ఖాళీ బోర్డులే కనిపిస్తున్నాయి.

పెట్రోల్ బంకు దగ్గర ఏర్పాటు చేసిన బోర్డు

నిబంధనలు పాటించని కమల్‌రాజు

ప్రశ్నించినందుకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి - తణుకు

ది ఏరియా ప్రయివేట్ అంబులెన్స్ ఓనర్స్, డ్రైవర్స్ వేల్ఫేర్ అసోసియేషన్‌లో సభ్యుడుగా ఉంటూ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక మొత్తంలో రేట్లు వసూలు చేస్తున్నాడనే సమాచారంతో కప్పల కమల్ రాజుని వివరణ కోరినందుకు యూనియన్‌పై పరోక్షంగా దాడి చేస్తూ, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశాడని ప్రయివేట్ అంబులెన్స్ యూనియన్ అధ్యక్షులు పెదపూడి సురేష్, మాజీ అధ్యక్షులు సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ప్రయివేట్ అంబులెన్స్ యూనియన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా సంఘ సభ్యులు అందరూ ఒకే తాటిపై నడుస్తున్నామని, తూర్పుగోదావరి జిల్లా విజ్జేశ్వరం గ్రామానికి చెందిన కప్పల కమల్‌రాజు గత సంవత్సరం నుంచి యూనియన్ సభ్యులుగా ఉంటూ తన అంబులెన్స్‌ను పట్టణానికి చెందిన ఒక ప్రయివేట్ ఆసుపత్రికి అంబులెన్స్ నడుపుతున్నాడని తెలిపారు. ఇటీవల కాలంలో వేరే అంబులెన్స్ తీసుకుని తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలో నడుపుతున్నాడని తెలిపారు. గత కొద్ది రోజుల క్రితం ఒక పత్రికలో ప్రయివేట్ అంబులెన్స్ నిర్వాహకులు ఆసుపత్రుల నుంచి రోగులను తీసుకెళ్లినా, తీసుకొచ్చినా దూరాన్ని బట్టి ఎంత ధర తీసుకోవాలనేది ప్రభుత్వం నిర్ణయించిదని, ఆ మేరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేశారన్నారని తెలిపారు. జిల్లాలో ఎక్కడ తప్పిదాలు జరిగినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్తలు వచ్చాయన్నారు. తణుకు యూనియన్‌కు కమల్‌రాజ్ అనే అంబులెన్స్ డ్రైవర్ ఎటువంటి చెడ్డ పేరు తీసుకురానని, నియమనిబంధనలకు కట్టుబడి ఉంటానని యూనియన్‌కు రాతపూర్వకంగా రాసిచ్చాడని తెలిపారు. అనంతరం ఒక రోగి విషయంలో పూర్తి ఆక్సిజన్ సిలిండర్ ఉందని వారిని నమ్మబలికి సగం సిలిండర్ ఆక్సిజన్‌తో రోగిని రాజమండ్రిలో ఒక ప్రయివేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ఆ రోగి మరణించడం జరిగిందన్నారు. రోగికి సంబంధించిన బంధువులు సోషల్ మీడియా ద్వారా వారి ఆవేదనను తెలియజేస్తూ, తణుకు యూనియన్ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రచారం చేశారని తెలిపారు. దీనిపై యూనియన్ సభ్యులు స్పందిస్తూ సమావేశం ఏర్పాటు చేసి కమల్‌రాజ్‌ని పిలిపించి తాను చేస్తున్న తప్పిదాలపై వివరణ కోరగా తాను ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టి నన్ను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మిమ్మల్ని కూడా ఇబ్బందులకు గురి చేస్తానని, మీ అంతు చూస్తానని బెదిరించి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశాడని అన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు తాటిపర్తి బోస్, కార్యదర్శి బడుగు నరసింహమూర్తి, జాయింట్ సెక్రటరీ ఎస్‌కె సలీం, ట్రెజరర్ ఇంటి గౌతం పాల్గొన్నారు.

దమయ్యపర్తి, బెజవాడ కోడుల్లో సిల్టు తీయాలి

ఎంఎల్ఎ నిమ్మల

పాలకొల్లు: పాలకొల్లు పట్టణంలోని దమయ్యపర్తి, బెజవాడ కోడులతో పాటు పట్టణ పరిధిలోని డ్రెయిన్స్‌లలో వేసవిలో సిల్టు తీసే పనులు చేపట్టాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన బుధవారం పురపాలక సంఘ కార్యాలయానికి వెళ్లి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ విలేకరులతో మాట్లాడుతూ వైసిపి 5 సంవత్సరాల కాలంలో మురుగు డ్రెయిన్స్‌ను పట్టించుకోకపోవడంతో వర్షాకాలంలో ముంపు సమస్య ఎదురైందని తెలిపారు. ప్రస్తుతం వేసవికాలంలో పనులు చేపట్టకపోతే వచ్చే వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికి పట్టణంలో ముంపు సమస్య ఎదురవుతుందని అన్నారు. పట్టణ పరిధిలోని వార్డులు ముంపు బారిన పడకుండా ఉండాలంటే గుర్రపు డెక్కను నిర్మూలించి, జెసిబి పనులు చేపట్టాలని తెలిపారు.

CHANGE OF NAME

I, **BOKKA BHAGYA LAKSHMI** W/o. Bokka Durga Mohan Rao, resident D.No. 2-51, Mutyalamma Gudi Meraka, KP Palem North, Mogalthur Mandal, W.G.Dt. A.P. after marriage I have changed my name from **VASAMSETTI BHARATHI** (Old name) to **BOKKA BHAGYA LAKSHMI** (New name) hence forth I am being called **BOKKA BHAGYA LAKSHMI** W/o. Bokka Durga Mohan Rao, for all purposes.

రెండు పేర్లు నావే

ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, కొర్లగుంట గ్రామపంచాయతి పరిధిలోని సింహాద్రిపురం గ్రామానికి చెందిన **తేరా నరసింహారావు** (29), S/o. **మరియదాసు** అలియాస్ **మారుమూడి అఖిల్** అనే నేను ఒకే వ్యక్తిని మా గ్రామంలో రెండు పేర్లతో నన్ను పిలుస్తారు. నా యొక్క ఆధార్, రేషన్ కార్డులు, ఇతర ధ్రువీకరణ పత్రాలలో **మారుమూడి అఖిల్** గా నమోదయి ఉన్నదని తెలియపరుస్తున్నాను. ఈ అంశాలలో ఏమైనా దోషాలు వస్తే మీరు తీసుకునే చర్యలకు నేను బాధ్యుడను.

తేరా నరసింహారావు
సెల్: 94917 53125
79890 43575

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.పి. 218/2023

పిటిషనర్: పి.ఎన్.వి.ఎస్.మహాలక్ష్మి
రెస్పాండెంట్: పసుపులేటి నాగరాజు, S/o. సత్యనారాయణ, వయస్సు 43, మార్కెట్ వీధి, అత్తిలి

Order 5 Rule 20 C.P.C. ప్రకారం రెస్పాండెంట్‌కు నోటీసు

పై నెంబర్ ఓ.పి.లో రెస్పాండెంట్‌కు కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపిన అమలు జరగనందున కోర్టు వారు దావాను **ది. 04-07-2024వ తేదీకి వాయిదా వేసినారు.** కావున రెస్పాండెంట్ పై తేదీన పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10 గంటలకు** హాజరై మీ సంజాయిషీ తెలుపుకోవలసినదిగాను, లేని పక్షంలో ఓ.పి. తీర్మానం కాబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

మోగంటి శివకృష్ణ
పిటషనర్ తరపు లాయర్
భీమవరం
భీమవరం
ది.22-5-2024 సెల్: 9848539039

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వారి కోర్టులో (Junior Division)
I.A. No. 213/2024 in O.S. No. 95/2024

పిటీషనర్లు/ వాద్యు:
1. Pericherla Nitin Kumar Varma, rep. by his G.P.A. Holder and Father Pericherla Rama Devandraju.
2. Pericherla Rama Devandraju

V/s

రెస్పాండెంట్/ ప్రతివాది: Kalle Yogesh

రెస్పాండెంట్ అడ్రస్సు:
Kalle Yogesh, S/o. Krishna Mohan, Owner of Villa No. 9, C/o. P.Subrahmanyam, Villa No. 11, Ananda Vihar, Opp:Abhayas School, Peda Amiram, Kalla Mandal, W.G.Dist.,

పై నెంబరు పిటీషనులో రెస్పాండెంట్ హాజరు నిమిత్తం **ది. 24-6-2024 సం॥ తేదీన 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల రెస్పాండెంట్ పరోక్షమున ఈ దావా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

R.PADMANABHA RAJU
R.V.S.S.SUNEETHA
Advocates, Vissakoderu
Cell: 9849635172

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వారి కోర్టులో (Junior Division)
O.S. No. 95/2024

వాద్యు:
1. Pericherla Nitin Kumar Varma, rep. by his G.P.A. Holder and Father Pericherla Rama Devandraju.
2. Pericherla Rama Devandraju

V/s

ప్రతివాది: Kalle Yogesh

రెస్పాండెంట్ అడ్రస్సు:
Kalle Yogesh, S/o. Krishna Mohan, Owner of Villa No. 9, C/o. P.Subrahmanyam, Villa No. 11, Ananda Vihar, Opp:Abhayas School, Peda Amiram, Kalla Mandal, W.G.Dist.,

పై నెంబరు దావాలో ప్రతివాది హాజరు నిమిత్తం **ది. 24-6-2024 సం॥ తేదీన 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల ప్రతివాది పరోక్షమున ఈ దావా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

R.PADMANABHA RAJU
R.V.S.S.SUNEETHA
Advocates, Vissakoderu
Cell: 9849635172